క్లుప్తంగా

విశేషంగా పునర్వసు నక్షత్ర హోమం



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించు కుని సింహగిరిపై గంగధార వద్ద ఉన్న ప్రాచీన రామాలయంలో శనివారం హోమం నిర్వహించా రు. ఆలయ ప్రాంగణంలోని మండపంలో సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయ స్వామి ఉత్సవమూర్తులను, చక్రపెరుమాళ్లను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, మండపారాధన, అగ్నిప్రతిష్ట, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.

విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు



కంటి పరీక్షలు జరుపుతున్న వైద్య నిపుణులు

పరవాడ: మండలంలోని మెట్లపాలెం జెడ్పీ పాఠశాలలో వాడచీపురుపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు.వాడచీపురుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి కనకప్పారావు, ఆప్తాలమిక్ ఆఫీసర్ వెంకటరావు 76 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. వారిలో కళ్లద్దాల కోసం 16 మందిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం పి.సురేష్‌కుమార్, ఎంపీహెచ్‌ఎస్ వి.సత్యనారాయణ, సిబ్బంది కృపా, ఎ.నారాయణ, వై.సత్యనారాయణ, అబీసు, ఎల్.శివలక్ష్మి పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం



సీత

పెందుర్తి: వేపగుంట సంతోష్ నగర్‌కు చెందిన కుమిలి సీత (40) అనే మహిళ అదృశ్యమైనట్లు ఆమె భర్త పోలీసులకు శనివారం పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శుక్రవారం సాయంత్రం 7.30 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లిన సీత తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు, స్నేహితుల ఇళ్ల వద్ద ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో ఆమె భర్త కృష్ణ పోలీసులను ఆశ్రయించాడు. సీఐ ఎల్.రామకృష్ణ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి ఏఎస్ఐ కె.సత్యనారాయణ దర్యాప్తు చేస్తున్నారు.

ఆస్తి గొడవలే కారణం

- సీఐ రామకృష్ణ

పెందుర్తి: మండలంలోని చింతగట్ల పంచాయతీ ఇప్పిలివానిపాలెంలో శుక్రవారం జరిగిన గొడవకు కేవలం ఆస్తి వివాదమే కారణమని..ఇందులో ఎలాంటి రాజకీయ కోణం లేదని పెందుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎల్.రామకృష్ణ వెల్లడించారు. గ్రామంలోని మాడిసి వెంకునాయుడు కుమారులు రమణ, పైడిరాజు మధ్య ఉన్న భూ తగాదాల వల్లే శుక్రవారం పైడిరాజు భార్య ఉప్మాక, రమణ భార్య కనకమ్మ మధ్య వివాదం జరిగి ఇద్దరూ కొట్టుకున్నారన్నారు. ఈ క్రమంలో ఇద్దరూ స్పృహ తప్పి పడిపోయారని..వెంటనే కేజీహెచ్‌కు చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు తరలించాలని వివరించారు. ఈ వివాదంపై ఇరు వర్గాల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ పేర్కొన్నారు.

అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



దాతకు బాండ్ అందజేస్తున్న ఏఈవో ఆనంద్‌కుమార్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి శనివారం పార్వతీ పురానికి చెందిన ఎం.సాయి రామకృష్ణ అనే దాత లక్షా 352 రూపాయల విరాళం అందజేశారు. దేవస్థానం తరఫున దాతకు బాండ్‌ను ఆలయ ఏఈవో ఎస్.ఆనంద్‌కుమార్ అందజేసి స్వామివారి దర్శనం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ పిల్లా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వెంకన్నకు ప్రత్యేక పూజలు

పెందుర్తి: స్థానిక వెంకటాద్రిపై శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే సుప్రభాత సేవ, ఆరాధన చేశారు. అనంతరం తోమాల సేవ జరిపారు. వెంకన్న సన్నిధిలో భక్తులు తులాభారం నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. శ్రీరామాయణ హవనం నిర్వహించారు. భక్తులకు వెంకటాద్రి దిగువ నుంచి రవాణా సదుపాయం కల్పించారు.

స్నేహమంటే ఇదేరా..



- ఆపద వేళ అండగా స్నేహితులు
- సేవా కార్యక్రమాల్లో మిత్రబృందాలు

నిజమైన మిత్రుడెవరో తెలిసేది కష్టకాలంలోనే అన్న మాటను సాకారం చేసి ఆదర్శంగా నిలుస్తున్నారు వారు. కష్టసుఖాల్లో మేము ఉన్నామనే భరోసా ఇస్తూ.. రక్త సంబంధాన్ని మించిన స్నేహ సుగంధాన్ని అందిస్తున్నారు.అలాంటి మిత్రులున్న వారే నిజమైన సంపన్నులు. ఆ స్నేహ బంధం ఎప్పటికీ వాడని సుగంధమే. విద్యార్థి దశలో బంధాన్ని కాపాడుకుంటూ స్నేహితులంతా ఒకచోట చేరితే అంతకు మించిన అ'పూర్వ' సమ్మేళనం ఏముంటుంది? . ఆ మిత్ర బృందాలు సామాజిక సేవలోనూ మేముసైతం అంటూ స్నేహమంటే ఇదేరా అని చాటి చెబుతున్నారు. అలాంటి వారి కోసం స్నేహితుల దినోత్సవం సందర్భంగా..



కొండ ముత్యాలు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న స్నేహితులు(ఫైల్)

పరవాడ: ఫ్రెండ్స్ అంటే ఏదో ఒకసారి కలిసి ఆనందంగా గడిపి వెళ్లిపోవడం కాదని.. వారి కష్ట సుఖాల్లో పాలు పంచుకోవాలని ఈ స్నేహితులు చాటి చెబుతున్నారు. తమలో ఎవరికి ఆపద వచ్చినా మిగిలిన వారు అండగా నిలవాలని స్నేహితులంతా కలిశారు. ఒకరి మెదడులో మెదిలిన మంచి ఆలోచనకు మిత్రులంతా కలిసి ఊపిరి పోశారు. దాంతో జీవన పోరాటంలో విభిన్న ప్రాంతాల్లో న్నా.. ఆపదలో ఉన్నవారికి చేయూతనిస్తున్నారు. ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఎవరికి ఆపద వచ్చినా మేమున్నామంటూ..

పరవాడ జిల్లా పరిషత్ పాఠశాలలో 1992–93లో పదోతరగతి పూర్తి చేసిన వారంతా ఒక గ్రూపుగా ఏర్పడ్డారు. తమ స్నేహితుల్లో ఎవరికి ఏ ఆపద వచ్చినా ఆదుకోవాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా తమతో చదువుకున్న పెదస్వయంభూవరం గ్రామానికి చెందిన ఇందల ప్రకాశరావు క్యాన్సర్‌తో బాధపడుతున్నట్లు తెలుసుకొని రూ.35వేలు పోగు చేసి ఇటీవల అందజేశారు.

- అలాగే పరవాడ గ్రామానికి చెందిన రొంగలి కారునాయుడు అనారోగ్యంతో కొంత కాలం కిందట మృతి చెందారు. ఇదే బ్యాచ్‌వారు రూ.1.75 లక్షలు పోగు చేసి కారునాయుడు కుటుంబానికి అందజేశారు.

సేవా నిరతి

వాడచీపురుపల్లి జెడ్పీ పాఠశాల 1995–96 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన వారు వెల్ఫేర్ గ్రూపు ఏర్పాటు చేసుకున్నారు. దాని ద్వారా ఆపదలో ఉన్న మిత్రులను ఆదుకొంటున్నారు. పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

వెల్ఫేర్ గ్రూపు చేపట్టిన కార్యక్రమాలు

- తమ బ్యాచ్‌కు చెందిన కూండ్రపు అమ్మాజీ అనారోగ్యంతో బాధపడుతుందని తెలుసుకుని వారంతా సమకూర్చిన రూ.20 వేలు అందజేశారు.
- ఇదే బ్యాచ్‌కు చెందిన ఐతి నరసింగరావు క్యాన్సర్‌తో మరణించాడు. అతని కుటుంబానికి రూ.15 వేల ఆర్థిక సాయం అందించారు.
- మరో స్నేహితుడు కొండ ముత్యాలు అనారోగ్యంతో మృతి చెందాడు. అతని కుటుంబానికి రూ.15 వేల ఆర్థిక సాయం అందజేసినట్టు పూర్వ విద్యార్థులు నాయుడు, కన్నూరి శ్రీనివాసరావు తెలిపారు.

రూ. 25 వేలు అందజేత

సబ్బవరం: మండలంలోని మల్లునాయుడుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004–05లో పదో తరగతి పూర్తి చేసిన వారు సంఘంగా ఏర్పడ్డారు. తోచిన రీతిలో సహాయ కార్యక్రమాలు చేయాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా తమతో పాటు చదువుకుని ఇటీవల మృతి చెందిన అయ్యన్నపాలేనికి చెందిన బొమ్మ ఆంజినేయులు కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందించారు.తోటి స్నేహితులు యడ్ల నాయుడు,లావేటి కిరణ్, కోన గణేష్,గండి త్రినాథ్,తుంపాల శివ,నక్కెళ్ల రామునాయుడు,గంగ్రెడ్డి బాలరాజు,నేబర్తి కృష్ణ,గండి గజపతినాయుడు తదితరులు పాల్గొన్నారు.



అయ్యన్నపాలెంలో మిత్రుడి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు



క్యాన్సర్‌తో బాధపడుతున్న మిత్రుడికి ఆర్థిక సాయం అందజేస్తున్న స్నేహితులు(ఫైల్)

ఎమ్మెల్సీ అభ్యర్థి బొత్సతో అదీప్‌రాజ్ భేటీ



ఎమ్మెల్సీ అభ్యర్థి బొత్స సత్యనారాయణను సత్కరిస్తున్న అదీప్‌రాజ్, వైఎస్సార్‌సీపీ నేతలు

పెందుర్తి: ఉమ్మడి విశాఖపట్నం జిల్లా స్థానిక సంస్థల వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి, రాష్ట్ర మాజీ మంత్రి బొత్స సత్యనారాయణను పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. బొత్సను ఆయన నివాసంలో నియోజకవర్గ సీనియర్ వైఎస్సార్‌సీపీ నేతలతో కలిశారు. ఈ సందర్భంగా అదీప్‌రాజ్ మాట్లాడుతూ రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో బొత్స సత్యనారాయణను భారీ మెజారిటీతో గెలిపిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ సీఈసీ సభ్యుడు పైలా శ్రీనివాసరావు, పరవాడ జెడ్పీటీసీ పైలా సన్యాసిరాజు, పార్టీ సీనియర్ నేతలు చుక్కా రామునాయుడు, బోకం రామునాయుడు, ఉప్పిలి కనకరాజు, మదుపాడ అంజి, సబ్బవరపు ముత్యాలనాయుడు, పాలిశెట్టి సురేష్‌రాజ్, కాపుశెట్టి శేషుబాబు, రాపేటి రాము, కర్రి బాబు, బోని నాయుడు, కర్రి శ్రీనివాస్ పాల్గొన్నారు.

29న సచివాలయం ముట్టడి



అంబేడ్కర్ విగ్రహం వద్ద కళ్లకు గంతలతో నిరసన తెలుపుతున్న మాలమహానాడు ప్రతినిధులు

పెందుర్తి: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 29న సచివాలయం ముట్టడి కార్యక్రమం తలపెట్టామని..మాలలంతా తరలిరావాలని మాల మహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి మాదాసు చారేంద్ర పిలుపునిచ్చారు.ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చిన సుప్రీంకోర్టు ఆ తీర్పుపై పునరాలోచన చేయాలని కోరారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ప్రధాని మోదీ, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి పై తిరుగుబాటుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. శనివారం స్థానిక డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద మాల మహానాడు ప్రతినిధులు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా చారేంద్ర మాట్లాడుతూ ఆర్టికల్ 341 నిబంధనను పక్కనపెట్టి బీజేపీ, మోదీ ఇచ్చిన స్క్రిప్టునే సుప్రీంకోర్టు వర్గీకరణకు అనుగుణంగా తీర్పునిచ్చిందని ఆరోపించారు. తెలంగాణలో వర్గీకరణకు ఆర్డినెన్స్ తెస్తాం అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడాన్ని తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో మాల మహానాడు ప్రతినిధులు మాదాసు చారింద్ర, మంతెన అప్పారావు, గొల్ల ఈశ్వరరావు, ముచ్చల రమణ, బి.విష్ణు, కాకర నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

శివాలయం పునర్నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న బలిరెడ్డి అప్పారావు

సబ్బవరం: మండల కేంద్రం సబ్బవరంలో శివాలయం పునర్నిర్మాణానికి శనివారం జనసేన నాయకుడు బలిరెడ్డి అప్పారావు రూ.50,005 విరాళం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు దంగేటి నానిబాబు,ప్రకాష్,బర్ల రమణ,గెడ్డం కృష్ణ,రమేష్,కోరాడ శ్రీను,కొల్లి గంగునాయుడు,కర్రి కనకరాజు, శేఖర్ పాల్గొన్నారు.

నిర్వాసిత యువతకు ఉపాధి కల్పించాలి



సింహాద్రి ఎన్టీపీసీ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీలో నిర్వాసిత నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా సంస్థ యాజమాన్యం కృషి చేయాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు కోరారు. సింహాద్రి ఎన్టీపీసీని శనివారం ఎమ్మెల్యే పంచకర్ల సందర్శించారు. సంస్థ ప్రాజెక్టు హెడ్ సంజయ్ కుమార్ సిన్హా పలు అంశాలను వివరించారు. అనంతరం ఎమ్మెల్యే పంచకర్ల మాట్లాడుతూ ఎన్టీపీసీ నిర్వాసిత గ్రామాల్లో అనేక మంది ఉన్నత చదువులు చదివి నిరుద్యోగులుగా ఉన్నారని వారిలో అర్హత కలిగిన యువతకు సంస్థలో ఉపాధి కల్పించడానికి చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు, రహదారులు, వైద్యం, విద్యా ప్రమాణాల మెరుగుకు ఎన్టీపీసీ సీఎస్సార్ నిధులు భారీ మొత్తంలో వెచ్చించి అభివృద్ధి చేయాలని కోరారు. అలాగే ఇటీవల మెడికల్ అన్‌ఫిట్ చేసి ఉద్యోగాల నుంచి తొలగించిన పలువురికి మెడికల్ టెస్టులు నిర్వహించి అర్హతను బట్టి తిరిగి విధుల్లోకి తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యే వెంట పరవాడ మాజీ జెడ్పీటీసీ సభ్యుడు పైల జగన్నాథరావు, రావాడ, పరవాడ సర్పంచ్‌లు మోటూరు సన్యాసినాయుడు, సిరపరపు అప్పలనాయుడు, కన్నూరి వెంకటరమణ, పలువురు కూటమి నాయకులు ఉన్నారు.

వీధి కుక్కల నియంత్రణకు చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

పరవాడ: నాయుడుపాలెం పంచాయతీలో వీధి కుక్కల నియంత్రణకు త్వరలో చర్యలు చేపట్టనున్నామని పంచాయతీ కార్యదర్శి నగిరెడ్డి రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. 'నాయుడుపాలెంలో శునకాల బెడద' శీర్షికన ఈ నెల 3న సాక్షిలో ప్రచురితమైన వార్తకు పంచాయతీ కార్యదర్శి స్పందించారు. ఎన్టీపీసీ సింహాద్రి యాజమాన్యం సౌజన్యంతో మండలంలో పలు గ్రామాల్లో వీధి కుక్కల ఏరివేత కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు. త్వరలో నాయుడుపాలెం పంచాయతీలో వీధికుక్కల ఏరివేత కార్యక్రమం చేపడతామని పంచాయతీ కార్యదర్శి రమేష్ తెలిపారు.

కల్యాణం.. కమనీయం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేసి విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అనంతరం కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం అందజేశారు.

తాగునీరు వృథా!



పైప్‌లైన్ లీకుతో బురదమయం అయిన రోడ్డు



కరణంగారి వీధిలో వృథాగా పోతున్న తాగునీరు

సబ్బవరం: మండల కేంద్రం సబ్బవరంలోని కరణంగారి వీధిలో తాగునీటి పైపులైన్ దెబ్బతిని లీకవడంతో తాగు నీరు వృథాగా పోతుంది. వీధిలోని బీకే నాయుడు షాపు సమీపంలో మురుగునీరు ప్రవహించే డ్రైన్ వద్ద పైపులైన్ దెబ్బతినడంతో తాగునీరు కలుషితం అవుతుందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు.నెల రోజులుగా ఇదే పరిస్థితి కొనసాగుతుండడంతో అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు కనిపించడం లేదని ఆరోపిస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకొని మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

వీఆర్‌ఏల ఆందోళన



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న వీఆర్‌ఏలు

పరవాడ: వీఆర్‌ఏల సమస్యలను తక్షణమే పరిష్కరించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మండల వీఆర్‌ఏల సంఘ అధ్యక్షుడు ఎం.సంతోష్ డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట సమస్యల పరిష్కారం కోసం శనివారం మండల వీఆర్‌ఏలు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ వీఆర్‌ఏలకు నైట్ డ్యూటీలు నుంచి విముక్తి కల్పించాలని, వీఆర్వో, అటెండర్, వాచ్‌మన్ ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ శాంతిభూషణ్‌రావుకు అందజేశారు. యూనియన్ కార్యదర్శి శంకర్, బచ్చలరాజు, పైడిరాజు, సన్యాసిరావు, శేఖర్, రూప, రేవతి, కుమారి, బాబూరావు, రాము, మోహన్, పెంటారావు, అప్పలరాజు, కటారి రాము తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రా ప్రీమియర్ లీగ్ విజేత సూపర్ స్టార్స్



క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేత గండి రవికుమార్

పెందుర్తి: మండలంలోని ముదపాక ట్రిపుల్ ఆర్ క్రికెట్ మైదానంలో నిర్వహించిన ఆంధ్రా టెన్నిస్ బాల్ ప్రీమియర్ లీగ్(ఏటీపీఎల్) విజేతగా సూపర్ స్టార్స్ జట్టు నిలిచింది. బాల బ్లాస్టర్స్, సూపర్ స్టార్స్ జట్ల మధ్య ఫైనల్ పోరు హోరాహోరీగా జరిగింది. ఉత్కంఠ భరితంగా సాగిన పోరులో సూపర్ స్టార్స్ జట్టు విజయకేతనం ఎగురవేసింది. విజేతలకు వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత గండి రవికుమార్ చేతుల మీదుగా ట్రోఫీ ప్రదానం చేశారు. కార్యక్రమంలో నిర్వాహకుడు సియాద్రి మణికంఠ, నాయకులు సియాద్రి బాలచంద్ర, యడ్ల నాయుడు, సిరపరపు వాసు, గురి శ్రీనివాస్, కరక రాము, గురి ఫణీంద్ర, గోతిరెడ్డి వంశి, ఎస్.అనిల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కాలేజీలు నిర్వహిస్తే కఠిన చర్యలు

విశాఖ విద్య: జూనియర్ కాలేజీల్లో ఆదివారం తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలకు సిఫార్సు చేస్తామని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు డాక్టర్ జి.సీతారామ్ తెలిపారు. సెలవు రోజుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ కాలేజీలు తెరువకూడదన్నారు. నగరంలో కొన్ని కార్పొరేట్, ప్రైవేటు కాలేజీలు ప్రభుత్వ సెలవు రోజుల్లో కూడా తరగతులు నిర్వహిస్తున్నట్లు కమిషన్‌కు ఫిర్యాదులు అందాయన్నారు. దీనిని సీరియస్‌గా పరిగణిస్తున్నామన్నారు. ఈ ఆదివారం బాలల హక్కుల కమిషన్ కూడా రాష్ట్ర వ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఆదివారం, అదే విధంగా రెండో శనివారం విద్యార్థులను కాలేజీలకు పిలిపించినట్లయితే, అలాంటి కాలేజీల గుర్తింపు రద్దుకు సిఫార్సు చేస్తామన్నారు. సెలవు రోజైన ఆదివారం కాలేజీలు నిర్వహించడానికి వీల్లేదని ఇంటర్మీడియట్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి పి.మురళీధర్ హెచ్చరించారు.

గిరిజన మహిళలు ఉన్నతంగా ఎదగాలి

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జస్టిస్ వెంకట శేషమ్మ



న్యాయ విజ్ఞాన సదస్సులో గిరిజన మహిళలకు సూచనలు చేస్తున్న జస్టిస్ వెంకట శేషమ్మ

సింహాచలం: గిరిజన మహిళలు చదువుకుని ఉన్నత స్థానంలో ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జస్టిస్ వెంకట శేషమ్మ అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం సింహగిరిపై ఉన్న గిరిజన గ్రామంలో గిరిజన మహిళలకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు.కార్యక్రమంలో పాల్గొన్న జస్టిస్ వెంకటశేషమ్మ మాట్లాడుతూ గిరిజన మహిళలంతా అన్ని విషయాలపైన అవగాహన కలిగి ఉండాలన్నారు. చదివితేనే ఉన్నత భవిష్యత్తు ఉంటుందని, ప్రతి ఒక్కరూ చదువుకోవాలన్నారు. అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఏమైనా సమస్యలు ఉంటే ప్రభుత్వం నుంచి పరిష్కరించుకునే హక్కు ఉంటుందని సూచించారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే నష్టాలను వివరించారు. మత్తు పదార్థాల అక్రమ రవాణలో నిల్వ చేయడంలో పాల్గొనవద్దని సూచించారు. హెల్మెట్ వాడకంపై కూడా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో సమస్యలపై ఆరా తీశారు. పలువురు గిరిజనులు తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వైద్యశిబిరం నిర్వహించి పలువురు గిరిజన మహిళలకు వైద్య సేవలందించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వేగవంతంగా ప్రసాద్ పథకం పనులు



పనులను పరిశీలిస్తున్న దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో కేంద్ర ప్రభుత్వ ప్రసాద్ పథకం నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా చేయాలని రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ సూచించారు. ఈ పనులను శనివారం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి, టూరిజం, దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులతో కలిసి కమిషనర్ పరిశీలించారు. కొండదిగువ పుష్కరిణిసత్రం, కల్యాణ మండపం, ఘాట్‌రోడ్డులో వైజంక్షన్, క్యూకాంప్లెక్స్, యాంపీ థియేటర్, అన్నప్రసాద వితరణ భవనంలో కోల్డ్ స్టోరేజీ పనుల వివరాలను ఇంజినీరింగ్ అధికారులు కమిషనర్‌కు వివరించారు. నాణ్యతలో ఎక్కడా రాజీపడొద్దని కమిషనర్ అధికారులకు ఆదేశించారు. ఆయా పనులకు సంబంధించి రూపొందించిన ప్రణాళికను సింహగిరిపై ఆనంద నిలయంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తిలకించారు. కార్యక్రమంలో టూరిజంశాఖ ఈఈ రమణ, దేవస్థానం ఈఈలు, ఏఈ పాల్గొన్నారు. అంతకు ముందు స్వామిని కమిషనర్ సతీసమేతంగా దర్శించుకుని పూజలు నిర్వహించారు.

విశాఖ–బ్రహ్మపూర్ ఎక్స్‌ప్రెస్ వేళల్లో స్వల్ప మార్పు

తాటిచెట్లపాలెం: విశాఖపట్నంలో బయల్దేరే విశాఖపట్నం–బ్రహ్మపూర్(18526) ఎక్స్‌ప్రెస్ వేళలు పలాసలో స్వల్పంగా మారాయి. ఆగస్టు 15 నుంచి పలాస స్టేషన్‌కు రాత్రి 6.43 గంటలకు చేరుకుని, అక్కడ 6.48 గంటలకు బయల్దేరుతుంది.